# పంకంలో తేలిన పద్మం

"అయ్యా, రాజబాబుగారూ. తెల్లారిపోయింది. సూరీడు తొంగిచూస్తున్నాడు" కొండయ్య తలుపుకొట్టాడు.

రాజబాబు మంచమ్మీదినుంచి దిగ్గున లేచి తలుపు పట్టుకుని నిలబడ్డాడు. కొండయ్య అతడి చెయ్యి పట్టుకుని గడపదాటించి చక్రాల కుర్చీలో కూర్చో బెట్టాడు.

"బాబుగారూ, రోజూ నన్నే మీరు లేపేవోరు. ఇవాళ నేను పిలిచేవరకూ ఎందుకు లేచి బైటికి రాలేదు ?"

"రాత్రి నాకు ఎక్కడోఅరుపులు వినబడ్డాయి. అందుకని చాలా సేపు నిద్ర పట్టలేదు. ఆ అరుపులు నీకు వినబడలేదా ?"

"తిని నిద్రకొరిగినా బాబూ. పొద్దుగలనే లేస్తగద. కడుపులో నాలుగు మెతుకులు పడగానే కండ్లు మూసుకుపోతాయి బాబూ."

అదొక చక్రాలబండి. రాజబాబుకోసం ప్రత్యేకంగా చేయించబడ్డది. ఆ బండిలో ఉదయం ఐదుగంటలకు బయలుదేరి రోడ్లు వేయబడిన ఆ అయిదెకరాల తోటలో నాలుగుపక్కలా తిరిగి ప్రతి చెట్టుకూ నీరందిందో లేదోనని పరీక్షగా చూస్తాడు. నీరు ఎంతలోతుకు దిగిందోనని వేలుగుచ్చి చూస్తాడు. పురుగుపట్టినజాడ లేమైనా కనబడితే అప్పటికప్పుడు మందు కొట్టిస్తాడు. పురుగుపట్టిన రెమ్మలనూ, కొమ్మలనూ కత్తిరింపజేస్తాడు.

ఆ తోటకు ముందువైపు మధ్యగా ఒకే పెద్ద గేటు—దానికెదురుగా పెద్ద అంగణం- పది మెట్లపైన రెండంతస్తుల పెద్ద భవనం -హుందాగా తళతళలాడే రాళ్లుతాపిన గోడలతో - మంచుకొండ నిలబడినట్టుగా ఉంటుంది. ఆ భవనానికి ఇరుపక్కలా విశాలమైన ఖాళీస్థలం పూలమొక్కలతో కళకళలాడుతూ ఉంటుంది.

ఆభవనం వెనుకగాఎత్తయిన ప్రహరీగోడ దానికి ప్రాకారమన్నట్టుగా కనబడుతుంది. దానికి ఎడమచేతివైపుగా ఒక వంటఇల్లూ పైకి చిన్నదిగా కనబడినా లోపల విశాలంగా ఉంది. ఒకపక్కగా నౌకర్లకు వరసగా అరుగదులు- అన్నీ బంగాళాపెంకు కప్పబడినవి, సిపాయిలు నిలబడినట్లుగా ఉంటాయి.

ఆ తోటలో కొబ్బరి, మామిడి, నారింజ, బత్తాయిచెట్లు ఏరకాని కారకం విడివిడిగా నాటబడ్డాయి. తోటచుట్టూ పొడవైన రాళ్ళపాతి, వాటికి ముళ్ళతీగె చుట్టబడ్డది. చివరగా ఒక మూలకు బావి తవ్వినట్టున్నారు. దానిలో బండపడ్డదని పూడ్చకుండా వదిలిపెట్టారు. అది రెండునిలువుల బావి. ఎంత చెత్తవేసినా పైకి కనబడదు. గొట్టపుబావిలోనుంచి కాలవలద్వారా నీరు అన్నిచెట్లకు అందుతుంది. నీరు సమృద్ధిగానూ, ఆయా ఋతువులలో వేయవలసిన ఎరువులవల్లనూ పంట బాగా చేతికందుతున్నది. పంటలు చెట్లమీదనే అమ్మివేస్తూ ఉంటాడు రాజబాబు.

"మామిడి పూతకు వచ్చినట్లుందే?" రాజబాబు చెట్లవంక చూశాడు.

"వచ్చింది కాని మందుకొట్టవలసిన అవసరం కూడా ఉందని తోటమాలి అన్నాడు. మీతో ఇంకా చెప్పలేదా బాబూ?"

"ఇంకా చెప్పలేదు"

చక్రాలబండి తోట చివరగా ఉన్న రోడ్డువరకూ వచ్చింది, రోడ్డు మలుపు తిరిగేచోట పాడుపడిన బావి రాజబాబు కంటపడ్డది. దానినిచూడగానే అతడిముఖం వికృతరూపం దాల్చింది. ఒళ్ళు జలదరించింది. కనుబొమ్మలు ముడిపడ్డాయి.

"బాబూ, దీనిని పూర్తిగా పూడ్చాలి. గొడ్లు కనక పడితే పైకి తియ్యటం కష్టం. దీనిని ఇట్లా ఎందుకుంచినారు బాబూ. ఇంతకాలంనుంచీ?"

"చూడు కొండయ్యా. మూడుతరాలనుంచీ ఆ బావి అట్లాగేఉంది. మాతాతగారు రావుబహదూర్ రాజలింగం గారి కాలంలో తవ్వించిన బావి అది. నీళ్ళకు బదులుగా రాయిపడ్డది. అట్లాగే వదిలేశారు. మా నాయనగారు వెంకటపతిరాజుగారు కూడా పూడ్చలేదు. ఇప్పుడు నా తరంలో నేనెందుకు పూడ్చటం? నీవన్నట్లు గొడ్లు ఇక్కడికి రావు. కొట్టంనుంచే పొలాలకువెళ్తాయి మేతకు" రాజబాబు ముఖం తిప్పుకుని అన్నాడు.

రోడ్డుకు చివరగా మునగచెట్టు ఉంది. కాని దానిపక్కనే సీమచింతచెట్టు

ఉండటంవల్ల గొంగళిపురుగులు రావన్న నమ్మకంతో అలా వేశారు. దారిలో కొన్ని మల్లెచెట్లు ఉన్నాయి. ఆ చెట్లు అమితంగా పూస్తాయి. అవికూడా బాగా అమ్ముడుపోతాయి.

రోడ్డు మలుపుతిరిగిన తరువాత ఒక అరఎకరంలో ద్రాక్షతోట వుంది. రాతి స్తంభాలతో పందిళ్ళు వేశారు. పంట చేతికి రాగానే కట్టింగుచేశారు. తరువాత ప్రూనింగ్ చేయవలసి ఉన్నది. కొత్తచిగుళ్ల వచ్చాయి. బాగా ఎరువులు పడ్డాయి. పందిరంతా చిగుళ్లతో తీగెలు నిలబడినట్లుగా కనబడుతుంటే రాజబాబు వాటిని పరీక్షగా చూశారు.

తోటంతా పచ్చపచ్చగా ఉంది.

ఉదయపువేళ చెట్లమీదుగా వచ్చే గాలి హాయిగా ఉంటుందని కూర్చొటానికి అక్కడక్కడ సిమెంటు బెంచీలు కట్టారు. రాజబాబు ఒకదానిమీద కూర్చున్నాడు.

అతడికి సుమారు నలభై ఏళ్ళు దాటినట్లు కనబడతాడు. నల్లటి మబ్బులతో కప్పబడిన చంద్రబింబంలా ఉంటుంది అతడి ముఖం అందుకు తోడు రింగులు తిరిగిన తలవెంట్రుకలు- సన్నటి పొడవైన ఆకారం. తాతమ్మగారు. "అంతా తాత పోలిక. ఆయన ఉండిచూసుకుంటే ఎంతబాగుండేది?" అనుకునేది.

రాజబాబు పొరుగూరిలో హాస్టల్లో ఉంటూ చదువుకుని పట్టభద్రుడైనాడు. తండ్రి చనిపోయిన తరువాత చదువు చాలించి ఇంటికివచ్చి పండ్లతోటల పెంపకాన్ని గురించి చాలా పుస్తకాలు చదివాడు. అప్పుడప్పుడు ప్రభుత్వాధికారుల సలహాలు తీసుకుంటాడు. ఒక రిటైరయిన ఆఫీసరు ప్రతినెలా వచ్చి ఆ తోట ప్రగతిని పరిశీలిస్తూఉండే ఏర్పాటు చేశాడు.

సరిగ్గా ఎనిమిదిగంటలకు రాజబాబు ఇంటికివచ్చి స్నానంచేసి కాఫీ టిఫిన్ తీసుకుంటాడు టి వి.లో గాని, రేడియోలో గాని ఏకార్యక్రమం వచ్చినా ఓపికతో వింటాడు అటు తరువాత వార్తాపత్రిక చేతబట్టాడు అక్కడినుంచి తన గదిలోకి వెళ్ళి కూనిరాగాలు తీస్తూ వర్ణచిత్రాలు వేస్తూ ఉంటాడు. అతడికి ముఖ్యంగా ప్రకృతిదృశ్యాలపట్ల ఆసక్తి ఎక్కువ. అస్తమిస్తున్న సూర్యబింబాన్ని ఎండిన ఆకులను రాల్చిన చెట్లకొమ్మల గుండా చిత్రించడమూ, ఉదయిస్తున్న సూర్యుడిని

నీటి అలలమీద చిత్రించటమంటే మా సరదా. వెన్నుకంటుకుపోయిన కడుపులతో ఒంగి కర్రబట్టుకుని నడిచే వృద్ధులను చిత్రిస్తాడు అతి సహజంగా బిడ్డను వీపుకు కట్టుకుని తలమీద కట్టెలమోపు నొకచేత్తో పట్టుకుని నడిచే యువతిని అత్యంత సుందరంగా చిత్రిస్తాడొకసారి.

రాజబాబు పుట్టుకతోనే తల్లిలేనివాడు. బామ్మ చేతుల్లో కొన్నినెలలు పెరిగాడు. ఆ తరువాత తాతమ్మ చేతులమీదుగా పెద్దవాడయ్యాడు. ఆమెను బామ్మా అని పిలుస్తూ పరుగులెత్తిస్తూ ఉండేవాడు బాల్యంలో.

ఇప్పుడామెకు వయసుమీరింది. ఎప్పుడూ పక్కమీద పడుకుని ఉంటుంది. ఆమె పదిగంటలకు భోజనంచేసి ఒక నిద్రతీసి లేచిన తరువాత, రాజబాబు భోజనానికి వస్తాడు. ఆమెతో మాట్లాడుతూ ఆ గదిలోనే బల్లమీద భోజనం చేస్తాడు. ఆమెకు తనచేతులతో అరటిపండు ఒలిచి నోటికందిస్తాడు.

"తోట ఎట్లాఉంది బాబూ?" ఆమె అడుగుతూ ఉంటుంది.

"తోటకేం నిక్షేపంలా ఉంది. నారింజ, బత్తాయిచెట్లకు పిందెలు ఎదుగుతున్నాయి. గొట్టపుబావి దగ్గర వేసిన అరటిచెట్లు గెలలువేశాయి. కర్పూర చక్రకేళి బాగా ఎదిగింది. కొబ్బరిచెట్లనిండా పూతా, పిందె."

''మనం ఊరికి దూరంగా ఉన్నాం. అదొక్కటే కొరత'' అంటుంది ఎప్పుడూ.

"బామ్మా, నీకు నగరంలో ఇన్ని ఎకరాల తోట దొరుకుతుందా ? ఇక్కడెంత హాయిగా ఉంది ? ఎంత చల్లటి గాలి! అక్కడొకతోట—ఇక్కడొకతోట-ఏడెనిమిది తోటలున్నాయి ఈ ప్రాంతంలో. అవిలేకపోతే నట్టడవి అనేదానివేమో? అయినా నీకింకా అలవాటు కాలేదూ?" అంటూ ఆమెను ఎగతాళిచేస్తూ ఉంటాడు.

"అయిందిలే. కాకేంచేస్తుంది? ఈ అయిదెకరాల తోట చౌకగా వచ్చిందని మన ఊరివాళ్ళు నలుగురు కలిసి కొన్నారు ఆశపడి. కాని ఒక ఏడాదికే వాళ్లకు నిరాశ కలిగింది. ధాన్యపురాసులు కంటికి ఆనినట్టు ఈ పళ్లతోటలూ, ఈ పెంపకాలూ ఈ రాబడీ వాళ్ల కంటికి ఆనలేదు. అందుకని మిగతా ముగ్గురూ వాళ్ల భాగాలను అమ్ముతుంటే మీ తాతగారి తాతగారు కొన్నారు. ఆయన కొనకపోతే ఇతరులు వస్తారు. కొత్తవాళ్ళతో పేచీలు రావచ్చని మనఊళ్లో ఒక ఎకరం భూమి

దీనికోసం అమ్మారు. ఇక్కడ మనకు ఇరుగా పొరుగా? ఆ పక్కతోట యజమాని మహమ్మదీయుడు. మనభాష రాదు. నౌకర్లను అడ్డంపెట్టుకుని మొదట్లో యిద్దరూ మాట్లాడుకునేవారు. ఆ తరువాత ఈయన ఆ భాష బాగా నేర్చుకున్నారు. ఇద్దరూ ప్రాణస్నేహితులయ్యారు.

"ఆయనపేరు?"

"మహమ్మద్ అబ్దుల్ ఖాన్."

"ఆయనపేరు సరే - ఈయనపేరు చెప్పు?"

"ఈయనపేరు రాజా మార్తాండరాయుడుగారు"

"రాజ్యంలేకుండా రాజా పేరేమిటి?"

"వాళ్ల పూర్వీకులు జమీందార్లట. అందుకని ఆయనను అందరూ అట్లా పిలిచేవారు. ఆ తరువాత ఇంగ్లీషువారు మీ తాతగారికి రావు బహదూర్ బిరుదు ఇచ్చారు."

"మా తాతముత్తాతల కథ చాలా ముచ్చటగా ఉంది."

"ఉందిగాని - చదువులు లేవు. పైపై భేషజాలే గాని"

"అసలే చదువురాదా?" ఆశ్చర్యపడ్డాడు రాజబాబు.

"అసలు చదువురాదని కాదు. ఇంగ్లీషుభాష రాదు. మీ తాతగారివరకు మీ నాయన తల్లిపోరువల్ల పొరుగూరు వెళ్ళి మెట్రిక్ చదివాడు. అప్పటికదే గొప్ప చదువు.

"తల్లిపోరన్నావు. ఎవరా తల్లి? మా బామ్మ?"

"అఁ ఆమే. "మావాళ్ళంతా చదువుతున్నారు. నా కొడుక్కు చదువురాకపోతే నాకు నామోషీ కాదా? వాడు చదువుకోకపోతే మా వాళ్లంతా నవ్వుతారంటే అప్పుడు పొరుగూరు పంపి చదివించారట" అన్నది.

"ఇట్లా పాతకాలపు కబుర్లు విన్నతరువాత- "ఆ మేడ కట్టించిందెవరు? కొన్నప్పుడు ఇల్లు లేదు కదా?"

"మేడసంగతా?'ఇల్లుకట్టుకోవా'లని ఆయన అనుకోగానే వెంటనే ఆ స్నేహి-

తుడు నేను మంచి ప్లానువేయించి దగ్గరుండి కట్టిస్తాను" అని మహమ్మదీయుల పద్ధతిలో కట్టించాడట. వాళ్ళకు గోషా ఉంది కనుక ఆడవాళ్ళకూ, మగవాళ్ళకూ విడివిడిగా గదులూ, విశాలమైన చావడులూ, అందరూ కూర్చొనేచోట పైకప్పు లకు నగిషీలూ, అలంకారాలూ, అద్దాలు ఆ దీపాలగుత్తులూ చూడగానే కళ్ల జిగేల్ మనేటట్టు కట్టించాడు."

"ఆ నగిషీలూ, ఆ షోకులూ, ఆ ఫర్నీచరూ కొన్ని లక్షలయి ఉంటుంది. ఇల్లుకట్టేటప్పుడు ఉండేవాళ్ళ సౌకర్యాలూ చేతిలో డబ్బూ చూసుకోవద్దూ? మన హోదాకు తగినట్టు మనం కట్టుకోవాలి"అన్నాడు అయిష్టంతో.

బామ్మగారితో మునిమనమడు ఏమాట మాట్లాడినా ఆమెకు మురిపెమే. అందుకే వీలుచేసుకుని అక్కరలేకపోయినా ఏదేదో సంగతులు కదిలించి మాట్లా డిస్తూ ఉంటుంది. అతడు తాతగారిని గురించి చేసిన రిమార్కుకు ఆమె నవ్వే సింది.

రాజబాబు తండ్రి చనిపోయిన తరువాత తమకు సరిపడేటట్టుగా ఇల్లు కట్టాడు. ఆ పెద్దఇంటిని చూసినవాళ్లు రాజబాబు కట్టిన ఇల్లు చాలా చిన్నదను కుంటారు. పైన బంగాళాపెంకు కప్పాడు. వాళ్ళకు అది చాలా అనుకూలంగా ఉంది. అదివరకూ ఉన్న నౌకర్లసంఖ్య తగ్గించాడు. ఇంట్లో వంటకొరకు, యింటి పనులకూ తన కుర్చీ నడపటానికి ఒకరూ, మొత్తం ఇద్దరినీ, తోటకు ముగ్గురినీ పెట్టాడు. వీళ్ల ఐదుగురూ ముఖ్యంగా అవసరమైనవారే. బామ్మకు మాత్రం ఒక ఆడమనిషిని విడిగా పెట్టాడు. తోటలో అవసరమున్నప్పుడు కూలీలను పెడుతూ ఉంటాడు.

''ఇదేమిట్రా అందరినీ తీసేశావు? ఎన్నాళ్లనుంచో ఉన్నారు వాళ్లు.''

అని బామ్మ "అంటే అసలు ఇంటిమనుష్యుల సంఖ్యకంటె నౌకర్ల సంఖ్య ఎక్కువ ఎందుకు ? శ్రీమంతులమని అందరూ అనుకోవటానికా?" నవ్వుతూనే 'ఇదీ తన పద్ధతీ' అన్నట్టు మాట్లాడతాడు.

"ఏ తరంలోనూ లేవు ఇటువంటి గుణాలు. వీడికెట్లావచ్చాయో? నిజంగానే తామిద్దరికీ ఎందుకూ అంతమంది ? డబ్బు దండుగ" అనుకున్నది పైకి వినబడే టట్టుగా.

నవ్వుకున్నాడతడు.

నౌకర్లు పని అయిన తరువాత చెట్టుకింద చేరి "బాబుగారు పెళ్ళిచేసుకో లేదా?" కొత్తనౌకరు అడుగుతున్నాడు ఒకరోజున.

కొండయ్య అందరిలోకీ పాతవాడు. రాజబాబు చిన్నతనంనుంచీ ఉన్నాడు.

"బాబుగారికి పెళ్ళెప్పుడో అయింది. ఆయమ్మ పల్లెలో పుట్టినా బస్తీషోకు లెక్కువ. 'ఈ ఊరు బాగాలేదు. సినెమాలు లేవు. నాటకాలు లేవు. నగరంలో ఉందామనేది. కారుకొంటే వారానికొకసారి వచ్చి తోట చూడవచ్చుకదా అనేది. అంత మేడ ఉండగా ఈ ఇరుకు కొంపలో ఉండటమెందుకనేది. ప్రతిదానికీ భీష్మించుకు కూర్చునేది. ఆమె జల్సాలూ, వినోదాలూ, భోగాలూ - అటువంటి జీవితం రాజబాబు కిష్టంలేదు. ఆ కోపంతో పుట్టింటికి చెప్పకుండానే నౌకర్లకు చెప్పి వెళ్ళిపోయింది. మళ్ళీ రాలేదు. బాబుగారూ వెళ్ళలేదు. ఒక్క యేడాదికే ఒకరిమీద ఒకరికి విసుగుపుట్టింది" అన్నాడు.

"బాబుగారు మళ్ళీ పెళ్ళిచేసుకోలేదు. బొమ్మలు గీసుకుంటూ ఉంటారు."

"బాబుగారి కాలుకుంటుతారు. అందుకని వెళ్ళిపోయిందేమో?" నని వాళ్ళకు సందేహం కలిగింది.

బాబుగారికి ఆయమ్మ ఉన్నప్పుడు కాలు బాగుంది.

"మూడు-నాలుగేళ్ళ కిందట జామకాయ కొయ్యబోయి చెట్టుమీదినుంచి పడ్డారు. మడమదగ్గర ఎముక చిట్లిందన్నారు డాక్టర్లు. పట్టీకట్టారు. రెండునెల లకు బాగయిపోయింది. ఇంట్లో నడుస్తారు. తోటలో తిరగటానికే ఈ కుర్చీ."

"అసలు ఆయమ్మ పద్ధతే వేరు. రాజబాబు మనసు వేరు. ఆయమ్మ అయన మనసు కనిపెట్టలేదు" కొండయ్య విప్పిచెప్పాడు.

రాజబాబు సాయంకాలపు వేళల్లో చక్రాల కుర్చీలోనే బయటికెళ్ళి చుట్టు పక్కల తిరిగివస్తాడు. ఆ ప్రాంతంలో జనం తక్కువ. ఎప్పటినుంచో అక్కడ ఇళ్ళు, తోటలూ గలవాళ్ళున్నారు. కాని- ఈతరంవారు నగరం చేరుకున్నారు. అక్కడ ఉన్నవారిని పలకరిస్తూ ఉంటాడు రాజబాబు. రానురాను నగరం విస్త రించి తోటలను సమీపిస్తున్నది. బస్సులు తోటలకు సమీపంగా నడుస్తున్నాయి.

చెట్టుకింద కుర్చీలో కూర్చుని పత్రిక చదువుకుంటున్నాడు రాజబాబు. అది అతడి ఉదయపు అలవాట్లలో ఒకటి.

"బాబుగారూ. జీపులో ఎవరో ఇద్దరు ఆఫీసర్లు వచ్చారు. లోపలికి వస్తామంటున్నారు" అన్నాడు నౌకరు.

"లోపలికి తీసుకురా." అని కొండయ్యను పిలిచి మరో రెండు కుర్చీలు వేయించాడు. కాఫీ-బిస్కెట్లు సిద్ధంగా ఉంచమని చెప్పాడు.

నౌకరు అతిథులను లోపలికి తీసుకువచ్చాడు. రాజబాబు లేచి నిలబడి "నమస్కారం, రండి" అంటూ కుర్చీలు చూపించి కూర్చోమన్నాడు.

వారిద్దరూ ప్రతినమస్కారం చేసి కూర్చుని, "వీరు రామ్‌నారాయణ్‌గారని మా ఆఫీసులో పనిచేస్తారు. నేను ఆఫీసరుగా వ్యవసాయ పరిశోధనాశాఖలో పని చేస్తాను. నాపేరు మార్తాండతేజ" పరిచయం చేసుకున్నాడు.

"అలాగా, ఇక్కడేనా ?"

''ఇక్కడే రాజేంద్రనగర్‌లో. మా కక్కడ క్వార్టర్సుకూడా ఉన్నాయి."

వాళ్ళు వచ్చిన పనేమిటో తెలియకపోవటంతో ముఖాలు చూస్తూ ఆఁహాఁ అంటున్నాడు రాజబాబు.

అంతలో కొండయ్య కుర్చీలమధ్య చిన్న బల్లవేసి కాఫీ బిస్కెట్లు తెచ్చాడు.

"తీసుకోండి" అంటూ కాఫీ కప్పులలో పోసి తానొకటి తీసుకున్నాడు రాజబాబు.

వాళ్ళిద్దరూ కాఫీతాగుతూ నాలుగుపక్కలా పరికించి చూశారు. కనుబొమ్మలు పైకెత్తి.

"మీరొక్కరే ఉంటారా ఇంత పెద్ద భవనంలో?" రామ్‌నారాయణ్ ప్రశ్నించాడు.

"ఆ పెద్ద భవనంలో ఎవరూ ఉండరు. ఇక్కడికి పదిగజాల దూరంలో ఒక చిన్న ఇల్లుకట్టుకుని నేనూ మా బామ్మగారూ ఉంటాము. ఆ వరసలో ఉన్న గదుల్లో మా నౌకర్లు ఉంటారు."

''మేము మీ తోట చూడటానికే వచ్చాము. మా ఆఫీసరుగారికి ఇటువంటి తోటలంటే ఇష్టం'' అన్నాడు రామ్‌నారాయణ్.

"అలాగా, రండి చూద్దాము"

వాళ్ళిద్దరూ నడిచి వస్తుండగా రాజబాబు చక్రాల కుర్చీలో కొండయ్యతో బయలుదేరాడు. తోటంతా తిప్పి చూపించాడు. ఆ చెట్ల నీటిపారుదలను, నీటివనరులను చూపించాడు.

అదంతా చూసి మార్తాండతేజ ఆశ్చర్యపడ్డాడు. తిరిగివస్తూ ఉండగా ఆ భవనం ప్రవేశం మళ్ళీ వచ్చింది.

"ఆ భవనం కూడా చూడాలనుంది. మీ కభ్యంతరం లేకపోతే" అన్నాడు మార్తాండతేజ.

"అభ్యంతరమేముంది?" అంటూ కొండయ్యను పిలిచి భవనం తెరిపించి దీపాలు వెలిగించమని చెప్పి వాళ్ళతో బయలుదేరాడు. రాజబాబు చేతికర్ర సహాయంతో భవనమంతా వాళ్ళకు తిప్పి చూపించాడు.

ఆ భవనం- దానిలోని అలంకారాలు- ఏర్పాట్లు చూసిన మార్తాండతేజకు కళ్ళు జిగేల్‌మన్నాయి. 'ఇంత అద్భుతమైన భవనం తనెక్కడా చూడలేదు. దానిని చూసినకొద్దీ అతడికి విస్మయం కలగటమే కాకుండా ఆశలు అంకురించి ఉక్కిరిబిక్కిరి చేశాయి.

"ఇంతఅద్భుతమైన భవనముండగా పిచ్చివాడిలా ఆ పెంకుటింట్లో ఉంటున్నాడా రాజబాబు? అనుభవించటం తెలియని వెర్రివాడు కాకపోతే? దేనికయినా అదృష్టం ఉండాలి"

''ఈ భవనాన్ని ఎవరైనా కావాలంటే అద్దెకిస్తారా ?" అడిగాడు మార్తాండతేజ.

"నాకు ప్రశాంత జీవితం అలవాటు, దానిని అభ్యంతర పరచని పక్షంలో ఇవ్వగలను''

"మీ ప్రశాంత జీవితాన్ని భంగపరచకుండా ఉండేవాళ్లు వచ్చి అడిగితే ఇస్తారా ?"

రాజబాబు అతడివంక వింతగా చూశాడు.

''కింద ఆఫీసు పెట్టుకుని పైన నేనుంటాను. అభ్యంతరం లేదుగా ? అయితే దాని అద్దె ఎంత'' అడిగాడు.

"ఇది మా పెద్దలు కట్టించిన భవనం. కట్టించినవారు లేరు కాని- మా తాతమ్మగారున్నారు. ఆమెకు అన్ని విషయాలూ చెప్పి మీకు నేను రేపు తెలియ పరుస్తాను. రేపు రండి" అన్నాడు రాజబాబు.

ఆ రాత్రి ఆమెతో సంప్రదించాడు.

ఆమె మౌనంగా కొంత సేపు ఉండిపోయింది.

''ఆ భవనాన్ని చెక్కుచెదరనీయకుండా కాపాడగలిగితే ఇవ్వు. అద్దె కచ్చితంగా కాగితంమీద రాయించుకో." అన్నదామె వ్యవహారరీత్యా,

"నాకు తెలుసు బామ్మా. అది చూపులకేగాని ఆ భవనంలో సామాన్యులు ఉండలేరు. నేను వాళ్ళతో మాట్లాడి అన్ని విషయాలూ చెప్తాను'' అన్నాడే కాని అతడి మనసు కొంచెం కలవరపడ్డది అద్దెకివ్వాలంటే.

తెల్లవారి మామూలుగా రాజబాబు కొండయ్యతో తోటలోకి వెళ్ళాడు.

మధ్యదారిలో కొండయ్య "బాబుగారూ పెద్దమ్మగారితో మీరు ఆభవనంలో ఉండరాదా? కింద ఉండి మేడమీద బొమ్మలు వేసుకుంటూ ఉండచ్చు కదా ? ఎందుకు దానిని పాడు పెడతారు బాబూ! దానికి తాళంపెట్టి మాలాంటి నౌకర్ల గదులదగ్గర ఆ చిన్న ఇంట్లో ఉండటమేమిటి? మీరు సుఖంగా పెద్దమ్మగారితో దానిలో ఉండండి బాబూ. అందరూ 'మీ బాబుగారు అక్కడెందుకుండర'ని అడుగుతున్నారు బాబూ ?" రాజబాబును చూసి బాధపడేవాళ్ళలో కొండయ్య ఒకడు.

'కొండయ్య కేం జవాబు చెప్పాలి!' అదివరలో ఎన్నిసార్లో అడిగాడు ఈ మాట. అతడి చేతుల్లో పెరిగిన రాజబాబు దగ్గర చనువుగా-ఒకోసారి మందలిస్తూ ఒకోసారి బ్రతిమిలాడుతూ మాట్లాడతాడు కొండయ్య. అతడిదగ్గర రాజబాబు ఏ రహస్యమూ దాచుకోడు.

"కొండయ్యా, నీవు ఈ ప్రశ్న ఎన్నిసార్లో వేశావు. నా కుటుంబప్రతిష్ఠ

నన్ను చెప్పనివ్వలేదు. ఒక భాగ్యవంతుడు తన దాయాది చనిపోతే అతడి ఆస్తి తనకు చెందుతుందని అతడిని ఆప్యాయంగా భోజనానికి పిలిచి ఇష్టమైన పదార్థాలతో విందుచేశాడు విషం కలిపిన ద్రాక్షరసముతో. ప్రీతిగా తాగిన అతడు తెల్లవారేసరికి శవంగా మారిపోయి ఈ పాడుపడిన బావిలోకి ఈడ్వబడ్డాడు. ఒక పెద్దయింటి యజమాని ఒక కన్యపిల్లకు డబ్బాశచూపించి తెల్లవారేసరికి ఆ పిల్లను శవంగా మార్చేశాడు. ఆ కన్నెపిల్ల కూడా ఆ బావిలోకి నెట్టబడ్డది. ఒక మదాంధుడు కొత్తగా పెళ్ళిచేసుకున్న నౌకరు భార్యను పైకి పనిమీద పిలిచి - ఘోర కృత్యం చేశాడు.

కొంతసేపు ఆగి గుండెను చేత్తో సర్దుకుని కొండయ్య ముఖంలోకి చూశాడు.

అతడి ముఖంలో ప్రేతకళ.

''ఆ బంగళాలో ఏమేమి ఘాతుక చర్యలు జరిగాయో నా నోటితో చెప్పలేకపోతున్నాను. స్త్రీల ఆర్తనాదాలతో ఆ భవనం దద్దరిల్లిపోయింది. ఆ భవనంలో ఆస్తికోసం ఘాతుకచర్యలు జరిగాయి. ప్రజలు మలమల మాడిపోయే మంతనాలు జరిగాయి. తండ్రికి కొడుకునూ, స్త్రీకి భర్తనూ, తల్లికి బిడ్డనూ. మానవతకు మనుగడనూ దూరంచేసే దురంతాలు జరిగాయి. ఆ మేడ ఎక్కితే ప్రతి గదీ, ప్రతి గోడా, ప్రతి వస్తువూ గోడుగోడున ఏడుస్తూ ఈ దురంతాలకు సాక్షీభూతంగా నిలబడినట్టే నాకు కనబడుతుంది. ఆ బావి ఒక పాపకూపం ఎన్నో దురంతాలను కడుపున పెట్టుకున్నది. కాని అది ఇంకా నిండలేదు.

"ఇప్పుడు చెప్పు- ఇదంతా తెలిసిన నేను ఆ మేడలో ఉండగలనా? ఆ మేడలో ఉండనందుకే నా భార్యకు నేను దూరమయ్యాను. ఆ మేడవంక చూస్తేనే నా గుండె వక్కలయి పోతున్నట్లుంటుంది."

కొండయ్య కుర్చీకి దగ్గరగా కూర్చుని మోకాళ్ళమీద తలపెట్టుకున్నాడు. అతడి కడుపు కలకలమన్నది.

రాజబాబు కళ్ళు తుడుచుకున్నాడు. కాని కళ్ళు కెంపుల్లా ఉన్నాయి.

ఆ భవనం ఎంతగా అందాలొలకపోస్తూ కళ్ళు తిప్పుకోలేకుండా చేస్తున్నదో అంత విషపూరితం. అది అంగడిబొమ్మ. దానిలో అమర్చిన ప్రతివస్తువూ

ఒక ప్రత్యేకతను సంతరించుకుని వాటి చక్కదనాన్ని ఎత్తిచూపిస్తుంది. దానిని చూడటానికి రెండుకళ్ళూ చాలవన్నట్లుంది. దారినపోయేవాళ్ళను తన సొగసులతో నిలబెడుతుంది. అటువంటి మేడిపండు నన్నాకర్షిస్తుందా? కొండయ్యా చెప్పు."

కొండయ్య ముఖంలోకి చూశాడు.

అంతటి శ్రీమంతుల ఇంటిబిడ్డ నౌకర్ల ఇంటిదగ్గరగా- అతి సామాన్యమైన దాంట్లో ఉంటున్నాడంటే ఏమోఅనుకున్నాడు కొండయ్య ఇంతకాలంనుంచీ. కాని ఈనాడు 'ఎంత దొడ్డమడిసి!' అనుకున్నాడు.

అనుకున్నట్టుగా మరునాడు రాజ్‌నారాయణతో మార్తాండతేజ వచ్చాడు. ఇల్లు మరొకసారి చూసి ఆ ఇంటికి నాలుగువేలు అద్దె ఇస్తానని రెండునెలల అద్దె ఇచ్చాడు.

రాజబాబు రశీదు ఇచ్చాడు.

మార్తాండతేజ తోటకు ఎరువులు కొత్తగావచ్చాయంటూ ఏ రకాని కారకం ఎరువులు వేయించి నీటితడి పెట్టించటం, నీటిపారుదల చేయించటం వంటి పనులు శ్రద్ధతీసుకుని చేయించాడు. ఆ సంవత్సరం పంట అయిదుశాత మధి కంగా వచ్చింది. కాని రాజబాబుకు గుండె భారమనిపించింది. ఎరువులక్రింద, ఆయన తీసుకున్న శ్రద్ధకూ రాజబాబు ఫీజు చెల్లించాడు లెక్క సరిపోయేటట్టుగా.

మార్తాండతేజ తన కుటుంబం ఊళ్ళో లేదని పైన ఒక్కడే ఉంటున్నాడు. క్రిందిభాగంలో పగలు ఆఫీసువేళల్లో పదిమంది తిరుగుతూ ఉంటారు. మధ్యమధ్య మార్తాండతేజ కేంపులకని వెళుతూఉంటాడు.

రాజబాబు ఎవరువెళ్ళిందీ ఎవరు వచ్చిందీ పట్టించుకోడు. నౌకర్లు చెవిన వేసిన వార్తలను వింటూఉంటాడు.

ఉన్నట్టుండి గజ్జలు ఘల్లుఘల్లుమన్నట్లూ ఆటలూ, పాటలూ, నవ్వులూ ఎక్కడినుంచో వినబడి రాజబాబును ఒక రాత్రివేళ లేపి కూర్చోబెట్టాయి. అవి ఎక్కడివో ఏమోనని మంచినీళ్లు తాగి పడుకోవాలని ప్రయత్నించాడు.

కాని - అతడికి మళ్ళీ నిద్రరాలేదు.

అంతలో అరుపులూ కేకలూ వినబడ్డాయి.

మళ్ళీ లేచి కూర్చున్నాడు రాజబాబు.

ఒక గంట సేపటికి అంతవరకూ వెలుగులు చిమ్ముతున్నట్లున్న భవనంలో మిణుకుమిణుకుమనే దీపాలు వెలిగాయి.

తెల్లవారి తోట చూడటానికి బయలుదేరినప్పుడు- "కొండయ్యా, రాత్రి గజ్జలమోత, ఆటలూ, పాటలూ, అరుపులూ నీకు వినబడ్డాయా ?" అడిగాడు రాజబాబు.

"నిన్ను లేపుదామనుకున్నాను. కాని నీ నిద్ర చెడగొట్టటం ఇష్టంలేక పోయింది. నేనే లేచి కఱ్ఱపట్టుకుని బయలుదేరుదామనుకున్నాను. కాని- ఒక్కడికీ సాధ్యంకాదేమోనని జంకాను" అన్నాడు.

"పగలంతా పనిచేసినోళ్ళం పొద్దుగూకగానే (చుక్కేసుకుని) ఒళ్ళెరగకుండా పంటాం బాబూ! ఇంక తెల్లారినంకనే లేస్తాం. కాని- మల్లన్న తోటంతా జాముకోసారి లేచి తిరుగుతాడు" అన్నాడు కొండయ్య.

"మల్లన్నా, నీవేమయినా రాత్రి కేకలూ, పాటలూ విన్నావా?" అడిగాడు రాజబాబు.

"నేను విన్నాను బాబూ. ఆటలాడినట్టూ, పాటలూ, ఘల్లుఘల్లున చప్పుళ్ళు విన్నాబాబూ నడిరాత్రివరకూ. మేడమీదనే ఈ చప్పుళ్ళు, దీపాలుకూడా ఉండాయి నేను ఆ బంగళాచుట్టూ తిరుగుతాడుంటా బాబూ" నవ్వులూ, ఏడుపులూ కూడా వింటా" అన్నాడు మల్లన్న.

"రోజూ వింటూ ఉంటావా ?"

"రెండు-మూడురోజుల కొకసారయినా వింటాబాబూ?"

రాజబాబు ఇంక తర్కించి వివరాలడగలేదు.

రాజబాబు బామ్మతో ఎన్నో విషయాలు మాట్లాడతాడు గాని ఈ విషయాన్ని గురించి ఒక్కమాట పైకి పొక్కలేదు. అతడి కెన్నో సంశయాలు- ఎన్నో రకాల భయాలు - అశాంతి - ఒకవిధమైన చికాకు - అతడికి నిప్పులలో పొర్లించినట్లుగా ఉంది,

మార్తాండతేజ ఆ భవనంలోకి వచ్చి ఒక సంవత్సరం కావచ్చింది. ఈ

సంవత్సర కాలంలో ఎన్నో భయంకరమైన దుర్వార్తలు వినవచ్చాయి. యెన్నో నిద్రలేని రాత్రులు గడిపాడు తను ఇంతకాలమని కంట్రాక్టు రానివ్వలేదు. ఏ సాకు చెప్పి అతడిని పంపించాలన్న ఆలోచనలో ఉన్నాడు రాజబాబు.

రోజులు మామూలుగా గడుస్తున్నాయి.

రాజబాబుకు అంతకంతకు అశాంతి ప్రబలమవుతున్నది.

ఒకరోజు రాత్రి బామ్మ "రాజూ!" అంటూ లేచి కూర్చుంది.

రాజబాబు దిగ్గునలేచి "ఏమిటి బామ్మా ? మంచినీళ్లు కావాలా ? గ్లాసుతో తెస్తాను లేచి కూర్చోగలవా?" అన్నాడు మంచం దగ్గరకొచ్చి.

"ఏమిటోరా! రాత్రి బాగానే పడుకున్నా. ఒక రాత్రివేళ నాకు అస్తవ్యస్తమైన కల ఒకటి వచ్చింది. ఒకదానికొకటి సంబంధంలేని సంఘటనలు. మీ నాన్న వచ్చి, 'నా మనుమలేరీ' అని అడిగాడు. ఇంతకాలానికి కలలోకి వాడు రావటమేమిటి? 'పిలు. నేను వాళ్ళని చూడాల'ని కొండకేకలు పెట్టాడు. కళ్ళు గట్టిగా మూసుకున్నాను ఇదేమిటని విస్తుపోతూ. తరువాత ఆ కల ఏమయిందో ? నేనే లేచి మళ్ళీ నీళ్ళుతాగాను. కాని మళ్ళీ నిద్రపట్టలేదురా" అంది.

"నీకిష్టమైన రామదాసు భజన కేసెట్ పెడతాను విను. నాకూ ఏదో కలతగా ఉండి నిద్రపట్టలేదు" అంటూ భజన కీర్తనలు వినిపించాడు తెల్లవారే వరకూ.

రెండుమూడు రోజులవరకూ రాజబాబు కనిపెట్టి చూస్తూనే ఉన్నాడు బామ్మను. ఆమె ఏమిటో ఆలోచిస్తూ వెర్రిచూపులు చూస్తున్నట్టుగా కనబడ్డది.

వారంరోజుల తరువాత ఆమెదగ్గరే కూర్చుని అతడు కాఫీ టిఫిన్ తీసుకుంటూ ఉండగా కొండయ్య వచ్చి "బాబుగారూ, మీకోసం ఎవరో వచ్చారు" అన్నాడు.

"ఆ గదిలో కుర్చీలో కూర్చోబెట్టు ఇప్పుడే వస్తా" నని టిఫిన్ ముగించి లేచాడు.

"మీరేనా రాజబాబుగారంటే?" ఠీవిగా కుర్చీలో కూర్చుని పలకరించాడా యువకుడు.

"అవును. ఏం పనిమీద వచ్చారు?"

"మా మేనమామ వెంకటేశ్వర్రావుగారు ఈ మధ్య చనిపోయారు. మీరిక్కడ- ఈ ప్రాంతాలలో ఉంటారని చెప్పారు. మీకొక ఉత్తరం ఆయన చనిపోకముందు రాశారట అది మీకందలేదనుకుని మరొకటి నా చేతికి ఇచ్చారు. నేను సరియైన ఎడ్రసు దొరకక తిరిగి తిరిగి ఈనాడు తెలుసుకోగలిగాను" అతడు కుర్చీలో కూర్చునే రాజబాబు కందించాడు ఉత్తరాన్ని.

దానినందుకున్న రాజబాబు ముఖకవళికలను పరీక్షగా చూడసాగాడు అతడు.

రాజబాబు ఆ ఉత్తరాన్ని జేబులో పెట్టుకుని "ఈ ఊరొచ్చి ఎంతకాలమయింది?" అడిగాడు.

ఇక్కడికి వచ్చి రెండేళ్ళయింది. నేను బ్యాంకిలో పనిచేస్తున్నాను. మా అన్నయ్య మార్తాండతేజ వచ్చి చాలా రోజులయింది. అతడు వ్యవసాయశాఖలో పనిచేస్తున్నాడు. ఈ ప్రాంతంలోనే ఒక తోటలో ఒకపెద్ద యిల్లు అద్దెకు తీసుకున్నాడని విన్నాను"

"మీ పేరు?"

"వెంకటపతి అని పెద్దలు పెట్టిన పేరు. నేను శ్రీనివాస్ అని పెట్టుకున్నాను."

"సరే! ఈ ఉత్తరం నాచేతికి వచ్చింది ఇప్పుడే కదా. మీకు ఎవరయినా తెలిసిన ప్లీడరు ఉన్నాడా?"

''లేదు',

"నేను పిలిపిస్తే మీకు సమ్మతమేనా ?"

"నిష్పక్షపాతంగా తీర్పు చెప్పగలిగినవాడయితేనే?"

"అయితే మీకుగాని నాకుగాని తెలియనివారినే పిల్పిస్తాను- ఆయన చెప్పిన విషయాన్ని బట్టి కదా తేల్చుకోవలసింది?"

"అవును"

"రేపే పిలిపిస్తాను వకీలును. మీకిద్దరికీ ఎప్పుడు వీలవుతుంది?"

"సాయంత్రపువేళ"

"అప్పుడే ఇద్దరూ రండి."

"సరే రేపు కలుద్దాము,"

''రాజబాబు వెంటనే బామ్మదగ్గరకొచ్చి "పాలు తాగావా బామ్మా ? మన అదృష్టంకొద్దీ ఒకటి కాకపోతే మరొకటయినా పాలిస్తున్నాయి ఆవులు."

ఆమె చిరునవ్వుతో అతడిని కంటినిండా చూసుకుంటుంది మురిపెంతో.

"ఆ ఆఫీసరు ఉన్నాడా ఆ పెద్ద యింట్లో?''

''ఉన్నాడు. పాటలూ పద్యాలూ కూడా పాడుతూ ఉంటాడు రాత్రిళ్ళు. నీవు వినలేదా?''

"అంత దూరాన్నుండి పాడితే నాకు వినబడుతుందా?"

''వినబడినా తెలియవు నీకు. తెలిసినా నచ్చవు."

ఆ రాత్రంతా రాజబాబు ఆలోచిస్తున్నాడు. "వీళ్ళిద్దరూ ఆమడ పిల్లలా ? పేర్లు కూడా పెద్దలపేర్లే పెట్టారె. అయితే దమయంతి వెళ్ళేటప్పుడు గర్భిణి అన్నమాట. బామ్మ చెప్పుతూ వచ్చింది, నిజమేనేమో? పిల్లలు పుడితే తండ్రికి తెలుపనివాళ్ళుంటారా? పెద్దవాడు మేనమామ ఉండికూడా తెలపకపోవటం నన్ను అవమానం చేసినట్లు కాదా? పిల్లలను కని తల్లి చనిపోయిందని నాకిప్పుడా తెలపటం?" అతడు శూన్యంలోకి చూస్తున్నాడు.

"పుట్టారనైనా తెలపకుండా దమయంతి నగలుపెట్టి పిల్లలను చదివించానని రాస్తాడా ఇప్పుడు? పిల్లలకు నేనొకడిని ఉన్నానని తెలిపితే వాళ్ళే వచ్చేవాళ్ళేమో ?''

"ఇప్పుడు ఎవరిని ఏమని ఏంలాభం?" కుర్చీలోనుంచి లేచాడు.

ఆ మరునాడే అస్తిని లెక్కలుకట్టేవాళ్ళను తీసుకుని వకీలు వచ్చాడు. అప్పటికే ఇద్దరన్నదమ్ములూ వచ్చి కుర్చీలో కూర్చున్నారు. వాళ్ళకెదురుగా రాజబాబు కూర్చున్నాడు.

వచ్చిన వకీలు తమిళుడు. పెద్ద ప్రాక్టీసు, పేరుప్రఖ్యాతులు కలవాడు ధరకట్టేవాళ్ళు, వకీలూ, మార్తాండతేజ, అతడి తమ్ముడూ అందరూ మేడనూ తోటనూ తిరిగి చూశారు.

తోటకంటె మేడవిలువ నాలుగింతలు ఎక్కువచేస్తుందని అంచనావేశారు. అదీగాక భవనానికి ముందూ - పక్కల కలిపితే అరఎకరం స్థలం ఉన్నది. కనుక అన్నదమ్ముల కోరికమేరకు మేడను పైన ఒకరికి, క్రిందిభాగం మరొకరికి ఖాళీస్థలం అంటే ముందూ పక్కల ఉన్న స్థలాలను ఇద్దరికీ పంచారు. ఇద్దరూ ముందుభాగంలో చెరొక గేటు పెట్టుకునే ఏర్పాటు చేసుకున్నారు.

తోట నాలుగున్నరఎకరాలను రాజబాబుకు, బామ్మగారికి పంచటమయింది. స్టాంపు కాగితాలమీద రాసుకోవటమూ, సంతకాలు పెట్టటమూ అయింది.

అన్నదమ్ములిద్దరూ చాలా సంతోషంగా ఉన్నారు.

రాజబాబు పెద్దఇంటినుంచి పాడుపడిన బావివరకూ వాళ్లకే చెందేటట్టుగా ఆ పొడుగునా పెద్ద గోడ పెట్టించటానికి నిశ్చయించుకున్నాడు.

వకీలుకు కరచాలనంచేసి వెలకట్టినవాళ్ళకు, వకీలుకూ ఫీజు ఇచ్చి వాళ్ళను సాగనంపాడు రాజబాబు. వాళ్ళకంటె ముందుగానే అన్నదమ్ములిద్దరూ వెళ్ళిపోయారు.

"పిల్లలు వచ్చారా లోపలికి? పిలిచి నాకు చూపించలేదేం? భోజనం చేసి వెళ్ళేవాళ్లుకదా?" అంది వాళ్ళమీద మమకారంతో.

"వాళ్లు పిల్లలు-నేను తండ్రినన్న భావంతో ఇక్కడికి రాలేదుబామ్మా. వాళ్లు బాకీదారులమాదిరిగా వచ్చి వాళ్ళ భాగాలు వాళ్ళు తీసుకువెళ్ళారు. తమ భాగాలను గురించి తప్ప మరొక్క మాటకు అవకాశం ఇవ్వలేదు. నేను మాట్లాడాలనే చూశాను. కాని వాళ్ళ ప్రవర్తన చాలా అసహ్యకరంగా ఉంది. నేను కొండయ్యను ఇప్పటికీ తండ్రిమాదిరిగా చూస్తాను. వాళ్ళు అంతమాత్రంగా కూడా అనుకోలేదు."

''అదేమిట్రా తల్లి సంగతయినా నీవడగవద్దూ? వాళ్ళయినా చెప్పద్దూ?"

''ఆ సంగతి మేనమామ ఉత్తరంలో ఉందిగా - చాలనుకున్నారు. పెద్ద వాడు తెలిసుండే భవనంలో అద్దెకుంటానని వచ్చాడు. రెండవవాడు 'మీరేనా రాజబాబుగా'రని అడిగాడు. బైటివాళ్ళమాదిరిగా వచ్చారు. ఇంటివాళ్ళమాదిరిగా పంచుకున్నారు. వాళ్ళను లోపలికి పిలిచి ఆత్మీయంగా నీకు చూపించాలని నాకు అనిపించలేదు."

"నేనున్నట్టు తెలుసా వాళ్ళకు?"

"నీవున్నావనేగా నీకొక భాగం తీసింది? నిన్ను చూడాలన్న కోరికను వాళ్లు వెలిబుచ్చలేదు. వాళ్లకా సామాన్యమైన మర్యాద కూడా లేదు. సంస్కార హీనులు. వాళ్ళు మనం కనబడకుండా ఇంకా ఎత్తైన గోడ వాళ్ళ యింటివెనుక కట్టటానికి ఏర్పాటు చేసుకున్నారు."

బామ్మగారి మనసు చివుక్కుమన్నది.

వాళ్లసంగతి తలుచుకుంటున్నకొద్దీ రాజబాబు హృదయం బరువెక్కినట్లవుతోంది.

రెండురోజులపాటు వాళ్ళ హృదయాలు ఒకదానికి తెలియకుండా మరొకటి అలమటించాయి.

ఇద్దరు నిండుకుండల్లా నౌకర్లదగ్గరయినా నోరుజారలేదు.

కాని- ప్రతిరోజూ రాత్రిళ్లు కిందినుంచీ పైనుంచీ ఆటలూ, పాటలూ, అరుపులూ వినబడుతూనే ఉన్నాయి. పాడుబడిన బావి ఉపయోగపడుతూనే ఉన్నది. వాళ్ల నౌకర్లు చెత్తవేసి మంటలుపెడుతూనే ఉన్నారు.

"మా పూర్వులు ఎంత ముందాలోచన కలవారు? ఆ పాడువడిన బావిని పూడ్చకుండా ముందుతరాలవాళ్ల కుపయోగించాలని అలాగే ఉంచారు" అనుకుంటాడు రాజబాబు.

"నా జీవితం ఇట్లాగయినా గడుస్తుందా?" అనుకుంటుంది బామ్మగారు.

——